క్లుప్తంగా

ఘనంగా పెన్షనర్స్ డే



పొన్నూరు: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది వారి అభ్యున్నతికి బంగారు బాటలు వేసేందుకు విశ్రాంత ప్రభుత్వ ఉపాధ్యాయురాలు షేక్ షరీఫాబీ అందించిన సేవలు మరువలేనివని ఎస్‌టీటీఓ ఎ.శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని లయన్స్ పాలీ సర్వీస్ సెంటర్‌లో రాష్ట్ర పెన్షనర్ల సంఘం పొన్నూరు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పెన్షనర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎస్‌టీఓ, పలువురు వక్తలు పాల్గొని షరీఫాబీ విద్యా రంగానికి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం షరీఫాబీతో పాటు, సీనియర్ పెన్షన్‌దారులను పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు మెమెంటోలు అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డి.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి జి.ప్రభుదాస్, గుంటూరు జిల్లా అధ్యక్షులు కె.నరసింహారెడ్డి, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ పి.మురళీకృష్ణ, శాఖ నాయకులు పాల్గొన్నారు.

నూరు శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి



కాకుమాను : ఈ ఏడాది పది పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని యూటీఎఫ్ నాయకుడు గ్యార యేసోబు అన్నారు. స్థానిక నన్నపనేని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో మోడల్ పేపర్లు అందజేశారు. ఈ సందర్భంగా గ్యార మాట్లాడుతూ విద్య ప్రతి ఒక్కరికి మూడో నేత్రమన్నారు. ప్రతి ఒక్కరికి విద్యనందించాలనే లక్ష్యంతో యూటీఎఫ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. పది పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు కష్టపడి చదివి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. మండలంలోని ఆరు ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు పదో తరగతి మోడల్ పేపర్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ–1 కె.కెనడీ, ఎంఈఓ–2 విజయభాస్కర్, ప్రధానోపాధ్యాయుడు బి.సత్యం, యూటీఎఫ్ నాయకులు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కిట్స్ అధ్యాపకునికి డాక్టరేట్



ప్రత్తిపాడు: కిట్స్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ) విభాగం అధ్యాపకుడు గుమ్మా లక్ష్మీనారాయణకు డాక్టరేట్ లభించింది. 'కోవిడ్–19 అండ్ లంగ్ డిజాస్టర్ డిటెక్షన్ యూజింగ్ కన్‌వొల్యూషన్ న్యూరల్ నెట్‌వర్క్స్' అంశంపై చేసిన పరిశోధనకు తమిళనాడు అన్నామలై యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు తెలిపారు. యూనివర్సిటీ ఏయూ విభాగం సీఎస్ఈ ప్రొఫెసర్ ఆర్.తిరువెంగటనాధన్ పర్యవేక్షణలో లక్ష్మీనారాయణ చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించడం అభినందనీయమని ప్రిన్సిపాల్ చెప్పారు. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో చైర్మన్ కోయి సుబ్బారావు, కార్యదర్శి కోయి శేఖర్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబులు లక్ష్మీనారాయణకు అభినందనలు తెలిపారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ



చేబ్రోలు: గ్రామాల్లోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లు సంపద సృష్టించే కేంద్రాలుగా తయారు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి సాయికుమార్ అన్నారు. చేబ్రోలు మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బందికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణపై రెండు రోజుల మొదటి బ్యాచ్ శిక్షణ మంగళవారం పూర్తి అయింది. మొదటి బ్యాచ్ శిక్షణ ముగింపు కార్యక్రమానికి హాజరైన డీపీవో సాయికుమార్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు సంయుక్తంగా గ్రామాభివృద్ధికి కృషి చేయాలన్నారు. చేబ్రోలు ఎంపీపీ కే సాహితి మాట్లాడుతూ శిక్షణలోని అంశాల ద్వారా పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. చేబ్రోలు ఎంపీడీవో కె.లలిత మాట్లాడుతూ ఇంటర్ విలేజ్ కనెక్టివిటీ రోడ్లు, అంతర్గత రోడ్లు, డ్రైన్‌ల నిర్మాణం కోసం చేపట్టవలసిన నిబంధనలను వివరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ టి.ఉషారాణి, పంచాయతీరాజ్ డీఈ ఎంఎన్ఎస్ ప్రసాద్, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

నగర కమిషనర్ పులి శ్రీనివాసులు



ఎన్జీవో కాలనీలోని పార్క్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు రూరల్: నగరపాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని, గ్యాంగ్ వర్క్‌ల ద్వారా డ్రైన్లు, సమస్యాత్మక ప్రాంతాలు శుభ్రం చేయడంపై ప్రజారోగ్య అధికారులు దృష్టి సారించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం కమిషనర్ ఏటీ అగ్రహారం, ఎన్జీఓకాలనీ, సాయినగర్, నల్లపాడు, బుడంపాడు, శ్రీనివాసరావుతోట తదితర ప్రాంతాల్లో పర్యటించి, అభివృద్ధి పనులను, ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసుకున్న బహుళ అంతస్తు భవనాన్ని పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో మైక్రో ప్యాకెట్స్ వారీగా చేపట్టే పారిశుద్ధ్య పనుల్లో మెరుగుదల ఉండాలని, డ్రైన్లను శుభ్రం చేయడం లేదని పలు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. శానిటేషన్ కార్యదర్శులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. నూతనంగా నిర్మాణం చేసే సీసీ రోడ్లకు బరంస్ లేకుండా చేపట్టవద్దని, నిర్మాణ పనుల అనంతరం డెబ్రిస్ తొలగింపుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్జీఓ కాలనీ పార్క్‌ని పరిశీలించి, ఓపెన్ జిమ్ పరికరాలు తక్షణం మరమ్మతు చేయాలని, పెండింగ్ పనులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డీఈఈని ఆదేశించారు. బుడంపాడులోని హిందూ, క్రిస్టియన్ శ్మశానవాటికలను పరిశీలించి, మౌలిక వసతుల కల్పనపై చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మెయిన్ రోడ్లపై అవసరాల మేరకు ఇండికేటర్స్‌తో కూడిన స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలని ఈఈలను ఆదేశించారు. అనంతరం బుడంపాడు మెయిన్ రోడ్‌లో ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసుకున్న భవన కొలతలను పరిశీలించారు. పర్యటనలో డీఈఈలు మధుసూదన్, సతీష్, ఏసీపీ వెంకటేశ్వరరావు, ఆర్‌ఓలు రెహ్మాన్, రవికిరణ్‌రెడ్డి, టీపీఎస్‌లు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు 'ఆయా'లే దిక్కు



తుమ్మలపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రం



కొండజాగర్లమూడిలోని అంగన్‌వాడీ కేంద్రం

ప్రత్తిపాడు: అంగన్‌వాడీ కార్యకర్తలు విధుల్లో అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. కేంద్రాల నిర్వహణ బాధ్యతను ఆయాలపై వదిలేసి వెళ్లిపోతున్నారు. అలాంటి చిత్రాలే ఇవి. ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెంలోని సచివాలయం ఎదురునున్న అంగన్‌వాడీ సెంటర్‌తో పాటు కొండజాగర్లమూడిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం మధ్యాహ్నం సమయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు విధుల్లో లేరు. ఆయాలే చిన్నారుల వద్ద కనిపించారు. అయితే ఇటీవల కాలంలో ప్రాజెక్టుకు కొత్తగా వచ్చిన సూపర్‌వైజర్లు ఫంక్షన్‌లు, కార్యక్రమాలకు వెళ్లేందుకు కార్యకర్తలకు అధికారికంగా అనుమతులు ఇస్తుండటంతో కేంద్రాల నిర్వహణ భారం ఆయాలపై పడుతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రశాంతంగా డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలు



డీసీ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన కుసుమకు ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఎన్నికల అధికారి

ప్రత్తిపాడు: పెదనందిపాడు బ్రాంచి కెనాల్ (డీసీ నంబరు 22) డిస్ట్రిబ్యూషన్ కమిటీ ప్రెసిడెంట్‌గా ప్రత్తిపాడు మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన కల్లూరి కుసుమ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పెదనందిపాడు బ్రాంచి కెనాల్ డీసీ కమిటీ ఎన్నికలు మంగళవారం ప్రశాంత వాతావరణంలో జరిగాయి. కమిటీ అధ్యక్షురాలిగా కల్లూరి కుసుమను, ఉపాధ్యక్షుడిగా మండవ శ్రీనివాసరావును, సభ్యులుగా జెట్టి సీతమ్మ, ఇక్కుర్తి కోమల, కోటపాటి సదాశివరావు, కల్లూరి కుసుమ, మండవ శ్రీనివాసరావు, కొల్లా ఆదిశేషయ్య, పోతినేని వేణుగోపాల్‌ను ఎన్నుకున్నారు. ఈ మేరకు ఎన్నికల అధికారి డి.శ్రీకాంత్ ఎన్నికైన వారికి ధ్రువీకరణ పత్రాలను అందించారు. వీరికి కూటమి నేతలు సి.త్రినాథ్, ఏ నరేంద్ర, జి.శివరాంప్రసాద్, కల్లూరి శ్రీనివాసరావులు అభినందనలు తెలిపారు. అదేవిధంగా వంకాయలపాడు డీసీ కమిటీ అధ్యక్షుడిగా కోయవారిపాలెం గ్రామానికి చెందిన అయినంపూడి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా పెదపలకలూరుకు చెందిన పి.కోటేశ్వరరావులు ఎన్నికయ్యారు.

విజ్ఞాన్ నిరులలో జేఎన్‌టీయూకే సౌత్‌జోన్ మహిళా ఖోఖో పోటీలు



క్రీడాకారులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: మండలంలోని పెదపలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు కాకినాడ జేఎన్‌టీయూ సెంట్రల్ అండ్ సౌత్ జోన్ అంతర్ కళాశాలల మహిళా ఖోఖో పోటీలను నిర్వహించామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ రాధిక తెలిపారు. రెండు రోజులపాటు జరిగిన కార్యక్రమానికి సోమవారం జేఎన్‌టీయూ స్పోర్ట్స్ బోర్డు కౌన్సిల్ డైరెక్టర్ డాక్టర్ జి.శ్యాంకుమార్, ఐసీటీ సెక్రటరీ డాక్టర్ జి.పి.రాజు పాల్గొన్నారన్నారు. కార్యక్రమాన్ని యశస్వి శుభగాత్రి స్వాగత నృత్యంతో ప్రారంభించగా ఇరువురు మాట్లాడుతూ విజ్ఞాన్ విద్యా సంస్థల్లో చదువుతో పాటు క్రీడలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వటం అభినందనీయమన్నారు. క్రీడాకారులని ప్రోత్సహిస్తున్న కళాశాల అధ్యక్షులు డాక్టర్ లావు రత్తయ్య, ఉపాధ్యక్షులు లావు శ్రీకృష్ణ దేవరాయలుకి కృతజ్ఞతలు తెలిపారు. అంతర్ కళాశాలల మహిళా ఖోఖో పోటీలలో 13 కళాశాలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. పోటీలలో ఐడియల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, కాకినాడ టీం విజేతగా నిలవగా, శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల టీం ద్వితీయ స్థానంలో, విజ్ఞాన్ నిరుల, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, కాకినాడ, జేఎన్‌టీయూ కంబైన్డ్ రన్నర్స్‌గా నిలిచినట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్, పోటీల ఆర్గనైజింగ్ సెక్రటరీ సీహెచ్ కిషోర్ కుమార్ తెలిపారు. వివిధ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్ మేనేజర్స్ కళాశాల యాజమాన్యం చేసిన ఏర్పాట్లపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ ఖోఖో టీం క్రీడాకారులను ఎంపిక చేయటం జరిగిందని స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎ.హరీష్ తెలిపారు. క్రీడాకారులకు విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య, ఉపాధ్యక్షుడు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అభినందనలు తెలిపారు.

రైతుల జీవన ప్రమాణాలను మెరుగుపరచటమే లక్ష్యం



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఐఏఎస్ విజయ్ కుమార్, విజ్ఞాన్ చైర్మన్ లావు రత్తయ్య

చేబ్రోలు : రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని పునరుజ్జీవింపజేయడంతో పాటు రైతుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో రైతు సాధికార సంస్థ కీలక పాత్ర పోషిస్తుందని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్, మాజీ ఐఏఎస్ టి.విజయ్ కుమార్ అన్నారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో 'ప్లాంట్ హెల్త్ ఇన్ ఆసియా : రీసెర్చ్ ప్రయారిటీస్ అండ్ పార్ట్‌నర్‌షిప్స్' అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఇంటర్నేషనల్ సదస్సు మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా మాజీ ఐఏఎస్ విజయ్ కుమార్ మాట్లాడుతూ రైతులకు కొత్త వ్యవసాయ పద్ధతులపై శిక్షణలు అందించడం, మౌలిక వసతులు, ఆధునిక పద్ధతులపై అవగాహన కల్పించడం, రైతు స్వాభిమానాన్ని పెంపొందించడం తమ లక్ష్యమన్నారు. రైతుల జీవనోపాధిని మెరుగుపరచడం ద్వారా గ్రామీణాభివృద్ధి సాధించడం తమ లక్ష్యాలలో భాగమన్నారు. రైతులకు ఆర్థిక, సాంకేతిక సహాయం, ఉచిత సలహాలు, మార్గదర్శకాలు అందించడంతో పాటు సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తామన్నారు. రైతు బంధు, రైతు భరోసా వంటి పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తామన్నారు.

- బ్యాంకాక్‌లోని అపారి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రవి ఖేతర్‌పాల్ మాట్లాడుతూ ఆహార ఉత్పత్తి నుంచి వినియోగం వరకు వ్యవసాయ–ఆహార వ్యవస్థలో ఆధునిక పద్ధతులను అనుసరించడం అవసరమన్నారు. వృక్షాల ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో ఫీల్డ్ సెన్సార్లు, డ్రోన్లు, డిజిటల్ పద్ధతుల ఉపయోగం ఎక్కువగా కనిపిస్తుందన్నారు. సేంద్రియ, ఇన్నోవేటివ్ పద్ధతులు వృక్ష ఆరోగ్యంతో పాటు ప్రకృతి ఆరోగ్యాన్ని కూడా పెంపొందిస్తాయన్నారు.
- యూరోపియన్ ఫైటోశానిటరీ రీసెర్చ్ కోఆర్డినేషన్ కోఆర్డినేటర్ డాక్టర్ బల్దిస్సెర జీవాని మాట్లాడుతూ యూరోపియన్ ఫైటోశానిటరీ రీసెర్చ్ ద్వారా పరిశోధన ప్రాజెక్టులను సమన్వయం చేయడంతో పాటు వృక్ష ఆరోగ్యం సంబంధిత పరిశోధన ప్రాజెక్టులలో వివిధ దేశాల పరిశోధకులను కలిసి పని చేయడానికి సహాయపడుతుందన్నారు. వృక్ష ఆరోగ్య విధానాలకు మద్దతు ఇవ్వడం, వృక్ష ఆరోగ్యంపై యూరోపియన్ విధానాలను మెరుగుపరచడంలో ఈ సంస్థ పరిశోధన చేస్తూ, శాస్త్రీయ ఆధారాలను అందిస్తుందన్నారు.

ఈ సదస్సులో వివిధ అంశాలపై చర్చించారు. హైదరాబాద్‌లోని ఐకార్–ఐఐవోఆర్ ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ కేఎస్ వరప్రసాద్, డాక్టర్ పాల్ డబ్ల్యూజే టేలర్, డాక్టర్ వినోద్ పండిట్, విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చాన్స్‌లర్ పీ నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

పొన్నూరు: పొన్నూరు ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు బుధవారం డిపోలో డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మేనేజర్ టి.అజిత కుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 11 వరకు ఆర్టీసీ డిపో అభివృద్ధికి చేపట్టాల్సిన సూచనలు, సలహాలు, సమస్యలను 9959225267 నంబరు ద్వారా తెలియజేయాలని కోరారు.

బాల్యవివాహాలతో అనర్థాలు



ప్రత్తిపాడు: బాల్య వివాహాలతో అనర్థాలు ఎదురవుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.భారతి అన్నారు. జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రత్తిపాడు కుమ్మరపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్‌లో మనమంతా భాగస్వాములమవుదామని చెప్పారు. బాల్యవివాహాలతో మాతాశిశు మరణాలు సంభవించే ప్రమాదం ఉందని వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్త వెంకాయమ్మ, తల్లులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

ఎంఈవో సీహెచ్ రమాదేవి

ప్రత్తిపాడు: బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని ఎంఈవో సీహెచ్ రమాదేవి అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని ఓ బైక్ మెకానిక్ దుకాణంలో బాలుడు పనిచేస్తున్నాడన్న సమాచారంతో మంగళవారం ఎంఈవోలు సీహెచ్ రమాదేవి, జి.లీలా రాణిలు మెకానిక్ షాపులో తనిఖీ చేసి బాల కార్మికుడితో మాట్లాడారు. పనులకు ఎందుకు వెళుతున్నావని, బడి ఎందుకు మానేశావని ప్రశ్నించారు. కుటుంబ పరిస్థితుల కారణంగా మానేసినట్లు బాలుడు చెప్పడంతో, తల్లిని పిలిపించి ఎంఈవోలు మాట్లాడారు. బాలలను పనుల్లో పెట్టుకుని వెట్టి చాకిరీ చేయించడం చట్టరీత్యా నేరమని చెప్పారు. అనంతరం బాలుడు నమోదైన పాఠశాలను గుర్తించి బడిలో చేర్పించినట్లు తెలిపారు.

విద్యుత్ అదనపు చార్జీలను రద్దు చేయాలి



పెదకాకాని: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు పెంచేదిలేదని ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ అన్నారు. పెదకాకాని సుందరయ్యకాలనీ నుంచి జాతీయ రహదారి వరకూ విద్యుత్ చార్జీల పెంపును నిరశిస్తూ నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా డిసెంబరు నెలలో అదనపు చార్జీలతో మంజూరు చేసిన బిల్లులను తగులబెట్టారు. నన్నపనేని శివాజీ మాట్లాడుతూ ట్రూ అప్ చార్జీల పేరుతో ఎఫ్‌పీపీసీఏ పేరుతో ఈ నెల విద్యుత్ బిల్లులలో వేసిన అదనపు చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం డిస్కంలకు సబ్సిడీ ఇచ్చి ప్రజలపై వేసిన భారాలను రద్దు చేయాలన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించాలనే ఒప్పందాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. గత పాలకులకు తమకు తేడా ఉన్నదని మాటలు కాకుండా చేతలలో నిరూపించుకోవాలన్నారు. రైతులపై భారం పడుతుందని, ఎన్నికలలో విద్యుత్తు చార్జీలు పెంచమని ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలన్నారు. సాంబయ్య,చిన్న రాఘవయ్య, నాగేశ్వరరావు, రాజ్యలక్ష్మి, వెంకాయమ్మ, జానకి, మల్లేశ్వరి, అంజలి, వెంకటరమణ పాల్గొన్నారు.

చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్లను సందర్శన



గుంటూరు రూరల్: రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీ రావు మంగళవారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట రైతు నేస్తం ఫౌండేషన్‌లోని చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన క్షేత్ర స్థాయిలో రైతులకు ఉపయోగపడే నమూనాల ఏర్పాటుకు క్షేత్ర సందర్శన చేయటం జరిగిందన్నారు. రైతు నేస్తం ఫౌండేషన్‌లోని సేంద్రియ వ్యవసాయ పంటల సాగు, చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్లను, నూనె గింజల గానుగ యూనిట్‌లను, రైతు శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిరుధాన్యాల సాగుపై ముమ్మర ప్రచారం జరిపి రైతులకు మరింత ఆర్థిక ప్రోత్సాహం, భరోసా అందించటానికి రైతు, గ్రామ స్థాయిలో ప్రాసెసింగ్ యూనిట్లను కుటీర పరిశ్రమగా ఏర్పాటు చేసే దిశగా వివిధ స్థాయిలలో అనుసరిస్తున్న పద్ధతులను పరిశీలించడం కోసం రావడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఉప వ్యవసాయ సంచాలకులు బాలునాయక్, ఏవో లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా సాగుతున్న రెవెన్యూ సదస్సులు



వెనిగండ్ల గ్రామంలో రెవెన్యూ సదస్సు



మాట్లాడుతున్న తహసీల్దారు వెంకటస్వామి

పెదకాకాని: రెవెన్యూ సదస్సులో నిషేధిత భూముల సమస్య పరిష్కారించాలని ప్రజలు అర్జీలు అందజేసినప్పటికీ సమాధానం చెప్పే నాథుడు కరువయ్యాడు. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ లేకుండానే రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. సమస్యల పరిష్కారం కోసం వచ్చిన వారు అధికారులు లేక నిరుత్సాహంతో వెనుతిరిగారు. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల సచివాలయం వద్ద మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామంలో నిషేధిత ఇళ్ల స్థలాలు, భూములు ఎక్కువగా ఉండటంతో పరిష్కారం కోసం రైతులు, గ్రామస్తులు వేదిక వద్దకు వచ్చారు. అధికారులు ఎవరూ లేకపోవడంతో అర్జీలు అందజేసి వెళ్లాల్సి వచ్చింది. జూనియర్ అసిస్టెంట్ మధ్యాహ్నం తరువాత కనిపించలేదు. గ్రామంలో ప్రధానంగా తోపు పోరంబోకు పేరుతో పలు సర్వే నెంబర్లలో రిజిస్ట్రేషన్‌లు నిలిపివేశారు. దీంతో ఇళ్ల స్థలాలు అమ్ముకునేందుకు, పసుపు కుంకుమ రూపంలో ఆడపిల్లలకు ఇచ్చేందుకు, అన్నదమ్ములు పంచుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ తరహా సమస్యల పరిష్కారం కోసం మొత్తం 26 అర్జీలు అందజేశారు. ఈ సదస్సులో దేవదాయ శాఖ గ్రూపు టెంపుల్స్ ఈఓ కృష్ణంరాజు, సర్వేయర్ వీరాంజనేయులు, సీనియర్ అసిస్టెంట్ మురళి, వీఆర్వోలు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సు

కాకుమాను: గ్రామంలో ఉన్న భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు బి.వెంకటస్వామి అన్నారు. మండలంలోని గరికపాడు పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం రెవెన్యూ సదస్సు జరిగింది. సదస్సులో తహసీల్దారు వెంకటస్వామి మాట్లాడుతూ రైతుల భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. భూ కొలతల కొరకు ఐదు అర్జీలు, ఆన్‌లైన్ దరఖాస్తు కోసం 44 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీలో అర్బన్ ఎక్స్ హ్యాక్‌థాన్



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కళాశాల యాజమాన్యం, అతిథులు

గుంటూరు రూరల్: కంపెనీలలో నెలకొనే సమస్యలకు సత్వరమే సులభతర పరిష్కార మార్గాలు చూపే విధంగా విద్యార్థులు ఆలోచనలు చేయాలని ఆర్‌వీఆర్.ఏసీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేనిలు తెలిపారు. మంగళవారం మండలంలోని చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం మాట్లాడుతూ అర్బన్ ఎక్స్ రీ థింక్, డిజైన్ అండ్ హ్యాక్ యూ సిటీస్ ఫ్యూచర్ అనే పేరుతో నిర్వహించిన రాష్ట్ర స్థాయి 24 గంటల హ్యాక్‌థాన్ పోటీలను కళాశాలలోని ఆర్‌జేఈ నెస్ట్ ఇంక్యుబేషన్ సెంటర్‌లో నిర్వహించారన్నారు. పోటీలలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి అనేక కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఇందులో విద్యార్థులు వివిధ విభాగాల్లోని సమస్యలకు పరిష్కార మార్గాలు చూపేందుకు తమ నైపుణ్యాలను ప్రదర్శించడంలో పోటీ పడ్డారన్నారు. కార్యక్రమానికి అతిథులుగా వచ్చిన కేఎల్ యూనివర్సిటీ డీటీఐ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ కె.నరసింహరాజు, కళాశాల సిబ్బంది చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ నరసింహరాజు మాట్లాడుతూ విద్యార్థులు వినూత్న ఆలోచనలతో నూతన ఆవిష్కరణలు చేస్తూ అంకుర పరిశ్రమల స్థాపన వరకు నిత్యం కృషి చేయాలని, సాంకేతికతలో తలెత్తే సమస్యల పరిష్కారానికి నూతన మార్గాలను శోధించాలని పేర్కొన్నారు. విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికితీస్తూ వారి ప్రతిభను ప్రోత్సహించేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ పి.త్రిపుర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలను నిర్వీర్యం చేసే చర్యలు మానుకోవాలి



దండమూడి డ్వాక్రా సంఘాల సభ్యులు

పొన్నూరు: మండల పరిధిలోని దండమూడి గ్రామంలో ఏళ్ల తరబడి సజావుగా సాగుతున్న డ్వాక్రా సంఘాల వ్యవస్థకు భంగం కలిగించే విధంగా గ్రామానికి చెందిన కొందరు కూటమి నేతలు ప్రయత్నిస్తున్నారని డ్వాక్రా సంఘాల సభ్యులు ఆరోపించారు. సంఘాల పనితీరు, యానిమేటర్‌పై కొన్ని రోజులుగా వస్తున్న ఆరోపణలను సభ్యులు తీవ్రంగా ఖండించారు. మంగళవారం గ్రామంలో పొదుపు సంఘాల సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ గ్రామంలో రెండు దశాబ్దాల నుంచి డ్వాక్రా గ్రూపులు కొనసాగుతున్నాయని, ప్రస్తుతం 34 గ్రూపులు ఉన్నాయని తెలిపారు. పొదుపు సంఘాలపై ఇప్పటి వరకూ ఎలాంటి అభియోగాలు లేవని, నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొందరు గ్రామ నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం నకిలీ సంఘాలతో రుణాలు స్వాహా చేస్తున్నారని యానిమేటర్‌పై అవాస్తవమైన ఆరోపణలను సృష్టించి, తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఏ విచారణకు అయినా సంఘాల సభ్యులు సిద్ధంగా ఉన్నారని, రుణాల స్వాహా ఆరోపణలపై గ్రామంలోని అన్ని సంఘాల సమక్షంలో విచారణ చేయాలని కోరారు. సంఘాలను ఇబ్బందులకు గురిచేస్తే అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని వెల్లడించారు. అనంతరం మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు భవనం పద్మలీలకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని పొదుపు సంఘాలు ఎదుర్కొంటున్న సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని ఎంపీపీ తెలిపారు. సమావేశంలో పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఏపీ మెడిటెక్ జోన్‌తో చలపతి ఫార్మసీ కళాశాల ఎంవోయూ



అవగాహన ఒప్పంద పత్రాలు చూపుతున్న కళాశాల యాజమాన్యం, సంస్థ ప్రతినిధులు

గుంటూరు రూరల్: విద్యార్థుల ఉన్నత భవిష్యత్తు కోసం తమ కళాశాల అత్యున్నత సంస్థలతో అవగాహన ఒప్పందాలు చేసుకుంటుందని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. మంగళవారం నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక శిక్షణ సహకార పరిశోధన ప్రాజెక్టులు పారిశ్రామిక సందర్శన తదితరాల కోసం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం విశాఖపట్నంకు చెందిన ఆంధ్రప్రదేశ్ మెడిటెక్ జోన్ ప్రైవేట్ లిమిటెడ్(ఏఎమ్‌టీజెడ్)తో తమ కళాశాల అవగాహన ఒప్పందం చేసుకుందన్నారు. కళాశాలల రంగంలో మొదటి కళాశాలగా తమ కళాశాల నిలవటం సంతోషంగా ఉందన్నారు. ఏఎమ్‌టీజెడ్ సంస్థ సీఈవో డాక్టర్ జితేంద్రశర్మ కళాశాల ప్రిన్సిపల్ అవగాహన ఒప్పందంపై సంతకం చేసి పత్రాలను అందిపుచ్చుకున్నారు. సంస్థ సీఈవో జితేంద్రశర్మ మాట్లాడుతూ తమ సంస్థ కామన్ మాన్యుఫాక్చరింగ్, సైంటిఫిక్ ఫెసిలిటీస్‌తో కూడిన ప్రధాన వైద్య సాంకేతిక పార్కు అని చెప్పారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ సంస్థతో భాగస్వామ్యం వల్ల నూతన సాంకేతికతలు అభివృద్ధి చెంది, సులభంగా అందుబాటులోకి వస్తాయన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు చలపతి ఫార్మసీ కళాశాల అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో చలపతి విద్యాసంస్థల అధినేత ఆంజనేయులు కళాశాల ప్రిన్సిపాల్ అధ్యాపకులకు అభినందనలు తెలిపారు.